www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 ఏప్రిల్ 2024
8 పేజీలు

ఏలూరు
పశ్చిమ గోదావరి

ఉండి రఘురామకే..

బి ఫారాలు అందుకున్న టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థులు

- సస్పెన్స్‌లోనే దెందులూరు..!
- బి.ఫారాలు అందుకున్న టిడిపి అభ్యర్థులు
- చింతమనేనికి ఇంకా దక్కని బి.ఫారం
- నేడు నామినేషన్ వేయనున్న చింతమనేని
- దెందులూరు సీటు బిజెపికే అంటూ ప్రచారం

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

టిడిపికి తలనొప్పిగా మారిన ఉండి టిక్కెట్‌పై సస్పెన్స్ వీడగా, దెందులూరు టిక్కెట్‌పై మాత్రం ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. దెందులూరు టిక్కెట్ చింతమనేని ప్రభాకర్‌కు ఉంటుందా, లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఈ సీటు బిజెపికి ఖరారైందని, తపన చౌదరి ఇక్కడ నుంచి పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. దీంతో దెందులూరు టిక్కెట్ కేటాయింపుపై ఏం జరుగుతుందో టిడిపి నేతలకే అర్థం కాని పరిస్థితి నెలకొంది. దెందులూరు నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు టిడిపి ఎంఎల్ఎగా గెలిచిన చింతమనేని ప్రభాకర్ రాజకీయ భవితవ్యం అయోమయంలో పడింది. ఈ ఎన్నికల్లో ఆయన టిడిపి నుంచి పోటీ చేస్తారా, లేదా అనే చర్చ కొనసాగుతోంది. తొలుత చింతమనేనికి కాకుండా ఆయన కుటుంబీకులకు దెందులూరు టిక్కెట్ కేటాయిస్తారనే ప్రచారం సాగింది. ఆ క్రమంలో టిడిపి అభ్యర్థుల తొలి జాబితాలో చింతమనేని పేరు లేకపోవడంతో అందుకు బలం చేకూరింది. చివరికి రెండో జాబితాలో చింతమనేనికి టిడిపి టిక్కెట్ కేటాయించింది. దీంతో చింతమనేని ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. అనూహ్యంగా కొద్దిరోజులుగా దెందులూరు టిక్కెట్ బిజెపికి కేటాయిస్తున్నారని, చింతమనేనికి టిక్కెట్ లేదంటూ ప్రచారం మొదలైంది. అనపర్తి సీటు పొత్తులో భాగంగా బిజెపి తీసుకుంది. అక్కడ టిడిపి అభ్యర్థి శేషారెడ్డి నుంచి టిడిపికి తీవ్ర ఒత్తిడి వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అనపర్తి సీటు టిడిపి తీసుకుని, దెందులూరు సీటు బిజెపికి ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు సమాచారం. బిజెపి తరపున ఏలూరు ఎంపీ టిక్కెట్ ఆశించిన తపన చౌదరి దెందులూరు అసెంబ్లీ స్థానానికి బిజెపి తరపున పోటీ చేస్తారని తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. రాష్ట్రంలోని టిడిపి అభ్యర్థులందరికీ చంద్రబాబు ఆదివారం బి.ఫారాలు అందించారు. చింతమనేనికి మాత్రం ఇవ్వలేదు. దీంతో చింతమనేనికి టిక్కెట్ లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సోమవారం తాను నామినేషన్ వేస్తున్నట్లు చింతమనేని ప్రకటించారు. మరోపక్క అనపర్తిలో శేషారెడ్డి బిజెపిలో చేరి అక్కడ నుంచి పోటీ చేస్తారని, దెందులూరు టిక్కెట్ చింతమనేనికే ఉంటుందని మరో ప్రచారం సాగుతున్నా, పరిణామాలు మాత్రం అందుకు విరుద్ధంగా కన్పిస్తున్నాయి. దెందులూరు సీటు ఎవరికో.. ఒకటి, ..6లో

నరసాపురం రోడ్‌షోలో పవన్‌కళ్యాణ్

ఆక్వా రంగాన్ని.. ఆదుకుంటాం..

ప్రజాశక్తి – భీమవరం, నరసాపురం, భీమవరం రూరల్

టిడిపి, బిజెపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు చేపడతామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, భీమవరంల్లో ఆయన ఆదివారం సాయంత్రం పర్యటించారు. తొలుత సీతారామపురంలోని స్వర్ణాంధ్ర కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్న పవన్‌కు జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తదితరులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి రుస్తుంబాద మీదుగా 216 జాతీయ రహదారి మీదుగా నరసాపురం మెయిన్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. అనంతరం రోడ్డుమార్గాన భీమవరం చేరుకున్నారు. సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో భీమవరం ప్రకాశం చౌక్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో పవన్ మాట్లాడారు. రెండు సభల్లో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో రెండు చోట్ల తాను ఓడిపోయినా ఇంకా నిలబడి ఉన్నానంటే మీ అందరి అభిమానమన్నారు. రానున్న కాలంలో రాష్ట్ర బంగారు భవిష్యత్తుకు ఎన్‌డిఎ కూటమి కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలనూ కొనసాగిస్తామని, ఎటువంటి కోతా విధించబోమని స్పష్టం చేశారు. నదుల అనుసంధానం పూర్తి చేసి పస్తుల్లేని రాష్ట్రాన్ని నిర్మిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును అతితక్కువ కాలంలో పూర్తి చేస్తామన్నారు. యువతకు స్కిల్ డెవప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయడంతోపాటు చేతి, కుల వృత్తులను పరిరక్షిస్తామని తెలిపారు. 50 ఏళ్లు దాటిన బిసిలకు రూ.5 వేలు పింఛన్ ఇంటి వద్దకే అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్, విద్యార్థులకు రూ.15 వేలు, రైతుల అభివృద్ధికి రూ.20 వేలు చొప్పున అందిస్తామన్నారు. అన్నా క్యాంటీన్లతోపాటు డొక్కా సీతమ్మ క్యాంటీన్లను ఏర్పాటు పేదల ఆకలి తీరుస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ..6లో

వశిష్ట గోదావరిపై వారధి నిర్మిస్తాం

మత్స్యకారులకు హాని కల్గించే జిఒ నెం.217 రద్దు

నరసాపురం, భీమవరం సభల్లో పవన్‌కళ్యాణ్

భీమవరం సభలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

బిజెపి ప్రత్యక్ష, పరోక్ష మిత్రులను ఓడించాలి

ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరణలో సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

రాష్ట్రానికి ద్రోహం చేసిన మతతత్వ బిజెపి కూటమిని, నిరంకుశ వైసిపిని ఓడించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో నాయకులు సిపిఎం ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిపిఎం అఖిల భారత కమిటీ ఇప్పటికే తన మేనిఫెస్టో విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర కమిటీ రూపొందించిన ఎన్నికల ప్రణాళికను జిల్లాలో విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. విభజన హామీల్లో భాగమైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసగించి, రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం సహకరించని బిజెపితో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తున్న టిడిపి, జనసేన, బిజెపి కూటమిని ఓడించాలని, నిరంకుశ వైసిపి ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని సిపిఎం పిలుపునిస్తుందన్నారు. బిజెపి పదేళ్ల పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంటు తదితర ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను హరిస్తుందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ ఇంటి పన్ను, ఆస్తి పన్ను, చెత్త పన్ను తదితర ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. అందుకే కేంద్ర ..6లో

మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

నూజివీడు రసాలే కాదు.. రాజకీయమూ పసందే

మధ్యపేజీల్లో..

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా సీతారామలక్ష్మి

8లో..

కల్లుగీత కార్మికుల సమస్యలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలి

8లో..

విజిలెన్స్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి – భీమవరం

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు విజిలెన్స్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు వివిధ శాఖలతో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ బృందాలు ఒకే బృందంగా, టీమ్ స్పిరిట్ తో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేయాలని కోరారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను నియంత్రించాలని, అక్రమ రవాణా అరికట్టాలని పేర్కొన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు డ్రై డేను పటిష్టవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్ఇబి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిష్పక్షపాతంగా సీజ్ చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అందుబాటులోని పోలీస్ దళాలు, ఇంకా అవసరమైన పోలీస్ బలగాల సేవలను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు గుర్తించిన రూట్లు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, షాడో టీమ్స్‌ను అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకుంటున్నామని, చట్టబద్ధం కాని ఆయుధాలు లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. రౌడీషీటర్‌లను బైండోవర్ చేయడంతోపాటు నిబంధనల మేరకు వారి నుండి నిర్దేశించిన మొత్తానికి సెక్యూరిటీ బాండ్ తీసుకోవడానికి ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి - ఉంగుటూరు

పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు పెంచమని ప్రభుత్వాలు ఒక పక్క చెబుతుంటే ఏపుగా పెరిగి నీడనిచ్చే చెట్లను అక్రమంగా నరికేసి పట్టపగలు ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. తల్లాపురం పంచాయతీ కార్యదర్శి బాజీ మాట్లాడుతూ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న పలు చెట్ల కొమ్మలను మాత్రమే శనివారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారన్నారు. ఆదివారం పలు చెట్లు మొదళ్లకు నరికి కలప తరలించుకుపోయిన ప్రాంతం తన పరిధి కాదని, నారాయణపురం పరిధికి వస్తుందని ఆగ్రామ సెక్రటరీకి సమాచారం ఇచ్చానన్నారు. నారాయణపురం కార్యదర్శి నాగేశ్వరరావును వివరణ కోరగా చెట్లు నరికి కలప తరలింపు విషయం తల్లాపురం సెక్రటరీ ద్వారానే తెలిసిందని, దీనిపై వాస్తవ పరిస్థితి కోసం ఆరా తీస్తున్నామని, బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా ఈ చెట్లు ముమ్మాటికీ తల్లాపురం పంచాయతీ పరిధికి చెందినవే అని మాజీ సర్పంచి రామకృష్ణ అంటున్నారు.

ట్రాక్టరుపై తరలిస్తున్న కలప

మొదళ్లకు నరికిన ఆనవాళ్లు

ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి నేతలు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

మండలంలోని గుణ్ణంపల్లి గ్రామ పంచాయతీలో అకాలంగా మృతి చెందిన గుణ్ణంపల్లి ఐదు కుటుంబాలకి, మహదేవపురం రెండు కుటుంబాలకి, కుటుంబానికి రూ.2 వేల చొప్పున గుణ్ణంపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సంకురాత్రి శ్రీనివాసరావు, సంకురాత్రి రాంబాబు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈదర రమేష్, వైట్ల నాగేశ్వరరావు, దుక్కిపాటి చరణ్, అశోక్, బాలాజీ, సుబ్బారావు, డేవిడ్ పాల్గొన్నారు.


రూ.5 వేలు సాయం అందిస్తున్న సీతారాం

టిడిపి ఆధ్వర్యాన గర్భిణికి రూ.5 వేల సాయం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో, సేవ చేయాలనే ఉద్దేశంతో టిడిపి నాయకులు పాకనాటి సీతారాం ఆదివారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని ఎంఆర్ఒ ఆఫీస్ కార్యాలయం పక్కన ఉన్న గుడిసెలలో నివసిస్తున్న పేరిచర్ల మంగమ్మ కూతురు నాగేశ్వరమ్మ నిండు గర్భిణికి ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబం వల్ల హాస్పటల్ ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ వార్డు సభ్యులు గారపాటి నరసింహారావు వున్నారు.

ఇండియా వేదిక గెలుపునకు కృషి చేయాలి

కాంగ్రెస్ పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థిని దువ్వెల సృజన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి జరగాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని కాంగ్రెస్ పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థిని దువ్వెల సృజన అన్నారు. ఆదివారం జీలుగుమిల్లి మండల కేంద్రంలోని ఇండియా వేదిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని అన్నారు. పోలవరం నియోజకవర్గంలో తనను గెలిపిస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కేంద్రంలో ఇండియా వేదిక అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం ప్రత్యేక హోదా మీద పెడతామని రాహుల్ గాంధీ అన్నారని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ సృజన గెలుపు కోసం ఇండియా వేదిక కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు వంక నాగరాజు, పార్టీ సభ్యులు తెల్లం సంకురుడు, అప్పారావు, తాళ్లూరు సూర్యారావు, దాసరి రామారావు, సుంకవల్లి శేషగిరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సృజన

పంగిడిగూడెంలో ఇండియా వేదిక అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

గోపాలపురం ఇండియా వేదిక అభ్యర్థి చోడదాసి మార్టిన్ లూథర్ ద్వారకా తిరుమల మండలం పంగిడిగూడెంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. సిపిఎం నేతలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిపిఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, కట్ట భాస్కరరావు, మానుకొండ వీర్రాజు, గోలుకొండ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఎం నేతలు

మజ్జిగ పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వేసవికాలం ప్రయాణికులకు సౌకర్యంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైసిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్నా, జెట్టి ఆదిత్య అన్నారు. జంగారెడ్డిగూడెంలోని 4వ వార్డు ఇందిరానగర్ కాలనీ కొత్తపేటలో వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బత్తిన చిన్నా, జెట్టి ఆదిత్య మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసి వేసవిలో ప్రయాణికులకు ఆసరాగా నిలవాలని తెలిపారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండా బత్తుల నరేంద్ర, కొండా బత్తుల రమేష్, కోన పాము, అయ్యన్న, కుసుమే నాని, కుర్రు ప్రభాకర్ రావు, దున్న శివ పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.

ఉగాది మృతికి సంతాపం

ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ

కామవరపుకోట: ప్రజా కళాకారుడు, నటుడు, గాయకుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి పునర్నిర్మాణ వ్యవస్థాపకులలో ఒకరు పులకండ ఉగాది మృతికి ప్రజానాట్యమండలి ఉమ్మడి గోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు సబ్బి కనకారావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్ రాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. అతి చిన్న వయసులోనే కళాకారునిగా తీర్చిదిద్దబడ్డ ఉగాది ఎన్నో నాటకాలు, నాటికలు నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, సాంఘిక పౌరాణిక నాటకాల్లో కూడా పాత్రలు పోషించి రాష్ట్రం, ఇతర ప్రాంతాల్లో కూడా పలు ప్రదర్శనలు ఇచ్చి, వేలాదిమంది ప్రేక్షకుల మన్నన పొందిన ఉగాది మృతి చెందటం ప్రజా కళకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ప్రజా కళాకారునిగా ప్రజా సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని స్వీయ రచనలతో ఎన్నో కళారూపాలను రంగస్థలం పైకి తెచ్చి, ప్రజానాట్యమండలికి గౌరవ ప్రతిష్టలు తెచ్చిన ఉగాది మృతికి ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణ బాబు, ప్రజానాట్యమండలి బుర్రకథ కళాకారులు ఎం.ప్రేమానందం, విభూది రాజేశ్వరి, కళాభిమానులు సాయిన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కనకరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమల్ల మధు, గదుల సత్యనారాయణ, పి.బాలాజీ, నల్లమోతుల శ్రీనివాస్ ఉగాది మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, కోరుమామిడి గ్రామంకు చెందిన కళ్ళెం ధనలక్ష్మి, W/o. రవికుమార్ తెలుపునది ఏమనగా, ఈనెల 17న నేను నిడదవోలు నుంచి మెడికల్ పని నిమిత్తం నరసాపురంకు బస్‌లో వచ్చి బస్టాండ్‌లో దిగి మెడికల్ పనికి వెళుతుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు దారిలో పోయినది. నా పాస్‌పోర్టు నెంబర్ **P8719522**. నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన నాకు క్రింది అడ్రస్‌కు అందించవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

నా అడ్రస్:
కళ్ళెం ధనలక్ష్మి
W/o. రవికుమార్, 7-19,
కోరుమామిడి గ్రామం, పిన్-534305,
నిడదవోలు మండలం, ప.గో.జిల్లా
సెల్: 6304841041

అల్లంచర్ల భూములు పేదలకు పంచాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్ల, రాజుపాలెం రెవెన్యూ భూములను పేదలకు పంచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అల్లంచర్ల, రాజుపాలెం పరిధిలోని గ్యాప్ ఏరియా భూములను సిపిఐ కామవరపుకోట నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లంచర్ల, రాజుపాలెం ప్రాంతంలో దళారులు, పెత్తందారులు పదుల సంఖ్యలో భూములు ఆక్రమించుకుని, క్రయవిక్రయాలు సాగిస్తుంటే నోరు మెదపని అటవీ శాఖ అధికారులు కష్టజీవులైన నిరుపేదలు రెవెన్యూ భూమిని బాగు చేసి జీడి మొక్కలు నాటి సాగుచేస్తుంటే అక్రమ కేసులు బనాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు అసలు అటవీ శాఖకు చెందిన భూమి ఎంత ఉందో వాటి సరిహద్దులు తెలుసుకోవాలని సూచించారు. అల్లంచర్ల, రాజుపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 226, 257లో 900 ఎకరాలు, సర్వే నెంబర్ 231లో 25 ఎకరాలు భూమి కలదని గ్యాప్ ఏరియాలో 1448 ఎకరాలు ఉందని మొత్తం భూమంతా తమదేనని బుకాయిస్తున్న అటవీశాఖ అధికారులు రెవెన్యూ, అటవీ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించు కోవాలన్నారు. న్యాయబద్ధంగా ప్రభుత్వ భూములు పట్టాలు పొంది సాగు చేసుకున్నటువంటి సాగుదారులపై చేస్తున్న దౌర్జన్యం ఆపకపోతే అటవీశాఖ అధికారులు తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు యాజమాన్య హక్కులు వచ్చేవరకు సాగుదారులంతా సిపిఐ నాయకత్వంలో సాగే భూ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదల పొట్ట కొట్టి భూమిని కట్టబెడుతున్న మధ్య దళారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలంతా సంఘటితంగా తమ న్యాయమైన హక్కుల కోసం పోరాటంలో భాగస్వాములై భూమిపై హక్కును సాధించుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గద్దల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల యేసు, జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చి బాబు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పేదరిక విముక్తి కోసం జరుగుతున్న పోరాటానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కన్వీనర్ పి.నాగ బాలాజీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్లమోతుల శ్రీనివాసరావు, బాలిన రమణారావు, పి.వి.రాఘవులు, నల్లమోతుల వెంకటేశ్వరరావు, పఠాన్, రసూల్ ఖాన్, షేక్ నసూరిద్దీన్, షరీఫ్, ఎం.ఏడుకొండలు, వెలుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణచైతన్య

సాయం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - దెందులూరు

పేదరికం, అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. పెదవేగి మండలం ముత్తన వీడు మెట్ట విజయరాయికి చెందిన బత్తుల చిరంజీవికి 6వ తరగతి బత్తుల అజయ్ కుమార్, 8వ తరగతి చదువుతున్న బత్తుల తనీష్ కుమార్‌లు ఇద్దరు కుమారులు. వీరు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో పాటు, గత కొంత కాలంగా అజేయ్ కుమార్ కామెర్ల వ్యాధితో, తనూష్ కుమార్ కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నారు. హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు పి.ఉమామహేశ్వరరావు ద్వారా తెలుసుకుని ఆదివారం బాధితుని ఇంటికి వెళ్లి రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బిపి వి.కుమార్, దివిఎస్ఎస్.ప్రకాష్ రావు, జి.రాజు, జి.మోహన్, జి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో స్వాతి

పేదల పెన్నిధి జగన్

ప్రచార కార్యక్రమంలో స్వాతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

సిఎం జగన్ మోహన్ రెడ్డి పేదల పాలిట పెన్నిధిలాంటి వారని ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైసిపి తరఫున మండలంలోని గురజ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ పేదల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలంటే రాబోయే ఎన్నికల్లో వైసిపిని గెలిపించుకోవాలన్నారు.

ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి, జగనన్న తిరిగి సిఎం కావడానికి సహకరించాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాచూరి రాధా, సర్పంచి ఎం.సరస్వతి, మేడూరు వెంకటేశ్వరరావు, ఎం.ఏసుబాబు, ముత్యాల రాంబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి మహాప్రభో!

రెండు నెలలుగా అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని ఆ రుగొలను పేట గ్రామంలో రెండు నెలల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రుగొలను పేట కాలనీలో దాదాపు 85 కుటుంబాలు నివసిస్తున్నాయి. తీవ్ర ఎండలకు పంచాయతీ బోర్లలో నీరు తగ్గిపోవడంతో ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు తాగునీరు పంచాయతీ పైపుల ద్వారా సరఫరా అవుతాయని, ఆ సమయంలో నీరు పట్టుకోవడానికి గ్రామస్తులందరూ సిద్ధంగా ఉండాలని అంటున్నారు. లేకపోతే అరకొరగా వస్తున్నటువంటి నీటిని పట్టుకోకపోతే కూలీ పనులు చేసుకుని జీవించే వారికి వంట చేసుకోవడానికి, ఇంట్లో వాడటానికి తగినంత నీరు లేకపోవడం వల్ల నీటి కోసం ఎదురు చస్తూ కూలీ పనులకు సమయానికి వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన

తాగునీటి కోసం ఎదురుచూస్తున్న రాంబాబు

వ్యక్తం చేస్తున్నారు. కూలీ పనులకు వెళ్లకపోతే జీవనం కొనసాగదని, పస్తులతోనే రోజులు గడపాలని ప్రజలు వాపోతున్నారు. రో జంతా పశువులు, గేదెలు, ఆవులు, మేకలు తాగటానికి మంచినీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని, ప్రజలు దాహంతో అలమటించటమేనని, నీటి కష్టాలు తప్పవని గ్రామానికి చెందిన చౌటపల్లి రాంబాబు తెలిపారు. ఆ సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలిగి విద్యుత్ సరఫరా నిలిచిపోతే నీటి కోసం మరింత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, సంబంధిత పంచాయతీ అధికారులు, నాయకుల దృష్టికి తమ సమస్యను తీసుకు వెళ్లినా ప్రయోజనం లేదన్నారు. కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సత్రంపాడులో సిపిఐ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రస్తుతం అధికారంలో ఉన్న నేతలు ఎన్నికల్లో అమలు కాని అనేక వాగ్దానాలను చేసి, ప్రజలను మభ్యపెట్టి, వారి ఓట్లను పొంది, అధికారం చేపట్టిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించలేదని సిపిఐ ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఇండియా వేదిక బలపరిచిన ఆయన ఆదివారం సత్రంపాడులోని 21, 22 డివిజన్ల పరిధిలో ఇంటింటికీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హడావిడిగా ఏలూరు నగరానికి అనుకొని ఉన్న ఏడు పంచాయితీలను ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసి, ఆ గ్రామాల సమస్యలను మాత్రం పరిష్కరించలేదని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతంలో ఎటు చూసినా మురుగునీరు నిలిచిపోయి, చెత్తాచెదారం నిండిపోయి, విపరీతమైన దోమలతో ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యల పరిష్కారం కోసం ఖచ్చితంగా పోరాటాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఇండియా వేదికలో భాగంగా ఏలూరు అసెంబ్లీ స్థానానికి సిపిఎం, ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థిగా

ప్రచార కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు

కంకి కొడవలి గుర్తుపై పోటీ చేస్తున్నానని, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థినిగా సిపిఐ, సిపిఎం, ఆమ్ ఆద్మీ, బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కావూరి లావణ్య హస్తం గుర్తుపై పోటీ చేస్తున్నారని, ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పళ్లెం కిషోర్ పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా..

స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాలలో కనీసం మౌలిక వసతుల కల్పన కూడా ఇప్పటికీ పూర్తి కాకపోవడానికి అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు కారణమని, అందుకే పార్టీలకు అతీతంగా స్వతంత్ర అభ్యర్థిని గెలిపిస్తే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అవుతుందని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆగిరిపల్లి మండలం పోతవరపాడు, నెక్కలం గొల్లగూడెం, కనసనపల్లి, అడవినెక్కలం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రహదారులు, వీధి దీపాలు, డ్రెయినేజీ వ్యవస్థ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా నేటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. అందుకు కారణం ఏమై ఉంటుందో ఒక్కసారి ఓటర్లు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీలో గెలిస్తే ఆ పార్టీని డిమాండ్ చేసే పరిస్థితి లేదని, ప్రతిపక్ష పార్టీలో ఉంటే అభివృద్ధి నిధులు అసలు రావని, అలా కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన క్షణాన రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన వారికి మద్దతు ఇవ్వాలి అంటే తన నియోజకవర్గానికి కావలసినవి ఇవి అని డిమాండ్ చేసి సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. టిడిపి అధినాయకుల తరఫున టికెట్ నిరాకరించి మంచి పని చేశారని, తనకు పార్టీలు కలసి రాలేదని, గన్నవరం నియోజకవర్గంలోనూ 2004లో స్వతంత్ర అభ్యర్థిగానే గెలిచానని ఆ చరిత్ర 2024లో పునరావృతం అవుతుందన్నారు. నిజమైన కార్యకర్తల అభీష్టం మేరకే తాను

ప్రచార కార్యక్రమంలో ముద్దరబోయిన

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. అందుకు కారణం ఒక్కటే అని ఎక్కడో ఉన్న వైసిపి అభ్యర్థిని దిగుమతి చేసుకొని ఇక్కడ టికెట్ ఇస్తే వైసిపి వారికి మద్దతు ఇవ్వాల్సిన గతి తమకు లేదన్నారు. 10 సంవత్సరాల పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికే మద్దతు ఇస్తామంటూ కార్యకర్తలు నిలబడిన తీరు తనను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచేలా చేసిందన్నారు. కార్యకర్తలే తన బలమని నాయకులను నమ్మి రెండుసార్లు ఓటమి పాలైన విషయం కార్యకర్తలకు తెలుసని, కార్యకర్తల అండదండలతో ఈసారి నూజివీడు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలవబోతున్నానన్నారు. తాను అధికారంలోకి వచ్చాక గ్రామాలలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు, గ్రామాలలో పక్కా రహదారుల ఏర్పాటు చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పట్టుబడ్డ బియ్యంతో జారిన

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చింతలపూడి

అక్రమంగా నిల్వవుంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లై డీటీ జరీనా తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం జిల్లా పౌర సరఫరాల అధికారి ఏలూరు వారికి వచ్చిన సమాచారం మేరకు మండలంలోని ప్రగఢవరం గ్రామానికి చెందిన నున్న రమేష్ పెంకిటిల్లుని సిఎస్, డీటీ, సిటిపి, గ్రామ రెవెన్యూ అధికారి తనిఖీ చేయగా అక్కడ 2 వేల కేజీల పిడిఎస్ రైస్ లభ్యమైంది. ఈ సందర్భంగా నున్న రమేష్‌పై నిత్యావసరాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగదు, మద్యం స్వాధీనం

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గడచిన 24 గంటల్లో 36 లీటర్ల మద్యం, రూ.3,50 వేల నగదును జిల్లా వ్యాప్తంగా తనిఖీలలో స్వాధీనం చేసుకున్నమని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నగార మోగుతున్న వేళ పోలీసులు తమ తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ తనిఖీలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది ప్రత్యేక చెక్ పోస్టులను జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆదివారం రాత్రి 7 గంటల వరకు 24 గంటల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 36 లీటర్ల మద్యం తనిఖీలలో స్వాధీనం చేసుకున్నారన్నారు. అంతే కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మూడు లక్షల 50 వేల రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి స్పష్టం చేశారు. ఎన్నికలు ముగిసే వరకు నిరంతరం తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయని ఆమె తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న సూర్యతేజ

గురుకుల విద్యార్థులకు అభినందన

ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గురుకుల కళాశాలలో ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఐటిడిఎ పిఒ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.సూర్య తేజ అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో ఐటిడిఎ పరిధిలోని గురుకులం కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 240 విద్యార్థులు హాజరు కాగా వారిలో 209 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 800కు పైబడి అత్యున్నత మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులతో, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 400ు పైబడి అత్యున్నత మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులతో సూర్యతేజ ముఖాముఖిగా మాట్లాడి, వారు సాధించిన ప్రగతిని తెలుసుకుని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులందరికీ వారు తదుపరి భవిషత్తు కార్యాచరణ ప్రణాళికపై దిశా నిర్దేశం చేస్తూ వారు ఏ విధమైన కోర్స్ తీసుకోవాలి, ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలి అనే విషయాలపై సూచనలు ఇచ్చారు. భవిష్యత్తులో అతున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్(గిరిజన సంక్షేమం), కెఆర్ పురం, గురుకులం సూపరింటెండెంట్, గురుకుల కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థులకు బి ఫారాలు

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థులు బి ఫారాలు అందుకున్నారు. విజయవాడ టిడిపి రాష్ట్ర కార్యాలయంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎంఎల్ఎ అభ్యర్థులకు బి ఫారాలు అందజేశారు. టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా కనుమూరి రఘు రామకృష్ణంరాజు, ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు, తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ బి ఫారాలు అందుకున్నారు. బిజెపి, టిడిపి, జనసేన కోటమిలో భాగంగా టిడిపికి నాలుగు అసెంబ్లీ సీట్లు, జనసేనకు మూడు సీట్లు, పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థులు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్‌కు బి ఫారాలు అందజేశారు. అలాగే పార్లమెంటు స్థానానికి సంబంధించి బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పాక వెంకట సత్యనారాయణ బి ఫారమ్ అందజేశారు. ఇప్పటికే అధికార పార్టీకి చెందిన భీమవరం, ఉండి, నరసాపురం, ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థులు గ్రంధి శ్రీనివాస్, పివిఎల్ నరసింహరాజు, ముదునూరి ప్రసాదరాజు, చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల బి ఫారమ్ తీసుకుని నామినేషన్ కూడా దాఖలు చేశారు.

బి.ఫారాలు అందుకున్న ఏలూరు జిల్లా టిడిపి అభ్యర్థులు

చింతలపూడి :టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నుంచి సొంగా రోషన్ కుమార్ బి ఫారమ్ అందుకున్నారు. ఈ నెల 22వ తేదీ సోమవారం నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు.

సిపిఐ అభ్యర్థి వెంకటేశ్వరరావుకు బి-ఫారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

2024 మే 13 జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక బలపరుస్తున్న సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావుకు బి ఫారం పత్రాలను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి, శ్రీనివాస డాంగే, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎం,యామిని, జిల్లా నాయకులు కొండేటి బేబి ఎం.విజయ, సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కె.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేనను, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా అప్పుల పాలుజేసిన వైసిపిని ఓడించాలన్నారు. రాష్ట్రంలో ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్, వామపక్షాల అభ్యర్థులను గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బి ఫారం అందుకుంటున్న వెంకటేశ్వరరావు

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘు రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపి ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని కనుమూరి రఘు రామకృష్ణంరాజు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎల్లప్పుడూ తనను ఆదరించి, ఆశీర్వదిస్తున్న ఉండి ప్రజల వెన్నంటే ఉండి, నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడతానని తెలిపారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉండి నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా బి ఫారం అందుకున్నానని తెలిపారు.

నేడు నామినేషన్‌ను దాఖలు..

టిడిపి ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా రఘు రామకృష్ణంరాజు ఈ నెల 22వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. పెదఅమిరంలోని తన స్వగృహం నుంచి ర్యాలీగా బయలుదేరి ఉండి తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ ర్యాలీలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనున్నారు.

ఉంగుటూరు నిడమర్రు వాసిదే

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఉంగుటూరు ఎంఎల్ఎగా గెలిచే అభ్యర్థి కచ్చితంగా నిడమర్రు మండలానికి చెందినవారే అవుతారు.. అదేంటి అంత కచ్చితంగా ఎలా చెబుతున్నారు.. ఎగ్జిట్ పోల్ అనుకుంటున్నారా.. విషయం ఏంటంటే ఉంగుటూరు సిట్టింగ్ ఎంఎల్ఎ, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల వాసుబాబు నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామానికి చెందిన వారు. అలాగే జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు నిడమర్రు మండలం చిననింద్రకొలనుకు చెందిన వారు. వీళ్లల్లో ఎవరు గెలిచినా నిడమర్రు మండలం వ్యక్తే అవుతారనే చర్చనడుస్తోంది.

పోటీకి ఎవరు అర్హులంటే..!

అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నిబంధనలు

మీకు తెలుసా

సార్వత్రిక సమరానికి సమయం ఆసన్నమైంది. ఎన్నికల్లో నామినేషన్ల పర్వం మొదలైంది. అన్ని పార్టీలూ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. అయితే అభ్యర్థిగా పోటీలో ఉండాలంటే కేంద్ర ఎన్నికల కమిషన్ పేర్కొన్న నిబంధనలు ఇవే..

ఎంపీ, ఎంఎల్ఎగా పోటీ చేయాలంటే కచ్చితంగా 25 ఏళ్ల వయస్సు పైబడి ఉండాలి. దేశ పౌరులు మాత్రమే పోటీకి అర్హులు.

తాను భారత దేశ పౌరుడినని, రాజ్యాంగంపై గౌరవంతో వ్యవహరిస్తానని ప్రమాణ పత్రంపై సంతకం చేసి ఇవ్వాలి.

లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి దేశంలోని ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలి. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు తాను ఎక్కడి ఓటరునో తెలియజేస్తూ సంబంధిత ఎన్నికల అధికారి ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

రాష్ట్రంలో ఎక్కడి ఓటరైనా ఏ అసెంబ్లీ స్థానానికైనా పోటీ చేయొచ్చు. తాను ఏ నియోజకవర్గానికి చెందినవాడినో తెలియజేస్తూ అక్కడి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

ఎంఎల్ఎ అభ్యర్థికి, ఎంపీ అభ్యర్థికి వచ్చే ప్రతిపాదికులు మాత్రం అదే నియోజకవర్గానికి చెందినవారై ఉండాలి.

జాతీయ రాష్ట్ర స్థాయిలో రిజిస్ట్రేషన్ అయిన పార్టీలకు చిహ్నాలు కోసం ఇచ్చే బి ఫారాలకు ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదికులు ఉండాలి.

ఉద్యోగులకు కష్టమే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు ఎన్నికల్లో పోటీకి అనర్హులు. వారు పోటీ చేయాలంటే తను ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రభుత్వ ఆమోదం పొందాలి.

సార్వత్రిక సంగ్రామం

నూజివీడు రసాలే కాదు..

రాజకీయమూ పసందే

నూజివీడు మామిడి తోటలకు బాగా పేరున్న ప్రాంతం. వందలాది రకాల మామిడి పండ్లు ఇక్కడ లభిస్తాయి. ప్రసిద్ధి చెందిన 'చిన్న రసం' పండ్లకు నూజివీడు పుట్టినిల్లు.

నూజివీడు పట్టణం, ప్రాంతం పూర్వం రాజుల పరిపాలనలో ఉండేది. నూజివీడు రాజుల కోట నుంచి విజయనగర ఆస్థానం వరకూ ఒక సొరంగం ఉండేది. అది ప్రస్తుతం కరెంటు ఆఫీసుగా ఉన్న రాజుల కోటకు ఆగ్నేయంగా ఉండేది. ఈ కోటను కోడిగుడ్డు సొన, మినుప పిండి, సున్నం వేసి నిర్మించారు. తరువాత ఆ కోటలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల ఏర్పాటు చేశారు.

ఐఐఐటి నూజివీడు : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం స్థాపించిన ప్రతిష్టాత్మక రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం నూజివీడు పట్టణ శివార్లలో ఉంది.

ధర్మా అప్పారావు కాలేజీ : ఏటా డిఎన్ఆర్ కాలేజీలో బాస్కెట్ బాల్ పోటీలు, బోయ్స్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలు చాలా పెద్ద స్థాయిలో జరుగుతాయి.

కృష్ణ యునివర్శిటీ ఉన్నత విద్యా కేంద్రం, సారథి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, శ్రీ దత్తాత్రేయ యోగా, వ్యాయామ పాఠశాల.

నూజివీడు వీణలు..

పట్టణంలోని వెంకటేశ్వర కోవెల ప్రాంతంలో వీణల తయారీ దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ తయారు చేసిన వీణలకు, దేశంలోనే కాదు విదేశాల్లోనూ ప్రాచుర్యం ఉంది. రాజుల కాలంలో ప్రారంభించిన వీణల తయారీదారులు ఇప్పటికీ తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. సరస్వతి, మయూర, విపంచి, డ్రాగన్, ఫోల్డింగ్, గోటు, మధుర వీణల తయారీలో షేక్ మాబు షేక్ మీరాసాహెబ్ నిష్ణాతులు. ఈ తండ్రీకొడుకులు రూపొందించిన వీణలను ప్రముఖ కళాకారులు చిట్టిబాబు, మంగళంపల్లి బాల మురళీకృష్ణ, నేదునూరి కృష్ణమూర్తి, ద్వారం భవన్నారాయణ, డాక్టర్ పినాకపాణి, శ్యాంసుందర్ వంటి విద్వాంసులు తమ కచేరీలకు కొనుగోలు చేసేవారు.

అత్యధికంగా ఐదుసార్లు గెలిచిన రికార్డు మేకా రంగయ్య అప్పారావుకే దక్కింది. 1952 నుంచి 15 సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ ఎనిమిది సార్లు, టిడిపి మూడుసార్లు గెలవగా, ఒకసారి ఇండిపెండెంటు గెలుపొందారు. మొత్తం మీద నలుగురు మాత్రమే ఈ నియోజకవర్గం నుంచి గెలవడం మరో విశేషం. ఎంఆర్.అప్పారావు ఐదుసార్లు, కోటగిరి హనుమంతరావు నాలుగుసార్లు, పాలడుగు వెంకటరావు రెండుసార్లు గెలిచారు. అప్పారావు ఐదుసార్లు కాంగ్రెస్ తరుపున గెలవగా, పాలడుగు కాంగ్రెస్ (ఐ) తరుపున రెండుసార్లు విజయం సాధించారు. హనుమంతరావు ఒకసారి ఇండిపెండెంటుగా, ఆ తరువాత మూడుసార్లు టిడిపి అభ్యర్థిగా గెలుపొందారు.



సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1952	ఎం.రంగయ్యఅప్పారావు	కాంగ్రెస్	పివి.రాఘవయ్య	స్వతంత్ర
1955	ఎం.రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	డి.నాగభూషణరావు	సిపిఐ
1962	ఎం.రంగయ్యఅప్పారావు	కాంగ్రెస్	డి.నాగభూషణరావు	సిపిఐ
1967	ఎం.రంగయ్యఅప్పారావు	కాంగ్రెస్	టి.మధుసూదనరావు	స్వతంత్ర
1972	ఎం.రంగయ్యఅప్పారావు	కాంగ్రెస్	ఎం.వెంకటేశ్వరరావు	స్వతంత్ర
1978	పి.వెంకట్రావు	కాంగ్రెస్(ఐ)	కె.వరప్రసాదరావు	జనతా
1983	కె.హనుమంతరావు	స్వతంత్ర	పి.వెంకట్రావు	కాంగ్రెస్
1985	కె.హనుమంతరావు	టిడిపి	పి.వెంకట్రావు	కాంగ్రెస్
1989	పి.వెంకట్రావు	కాంగ్రెస్	ఎంఆర్.అప్పారావు	టిడిపి
1994	కె.హనుమంతరావు	టిడిపి	పి.వెంకట్రావు	కాంగ్రెస్
1999	కె.హనుమంతరావు	టిడిపి	పి.వెంకట్రావు	కాంగ్రెస్
2004	ఎంవి.ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	కె.హనుమంతరావు	టిడిపి
2009	చిన్నం రామకోటయ్య	టిడిపి	ఎంవి.ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్
2014	ఎంవి.ప్రతాప్ అప్పారావు	వైసిపి	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టిడిపి
2019	ఎంవి.ప్రతాప్ అప్పారావు	వైసిపి	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టిడిపి

ఆకివీడు నుంచి తొలి అభ్యర్థి రఘురామకృష్ణుడే

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు మండల చరిత్రలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎంఎల్ఎ అభ్యర్థిగా ఎంపికైన మొట్టమొదటి వ్యక్తి కనుమూరి రఘు రామకృష్ణంరాజు. రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పడి 38 సంవత్సరాలైనా ఇప్పటివరకూ ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా ఈ మండలానికి చెందిన వ్యక్తిని తమ అభ్యర్థిగా ప్రకటించలేదు. మండలానికి ముందు ఆకివీడు తాలూకా ఉన్న రోజుల్లో కూడా ఎవరూ లేరు. ఆకివీడు తాలూకా ఏర్పడడానికి ముందు ఈ ప్రాంతమంతా భీమవరం తాలూకాలో ఉండేది. ఆనాడు ఇక్కడ మూడు ఫిర్కాలు ఉండేవి. ఆకివీడు సమితి ప్రాంతంలో ఆకివీడు, కాళ్ల, ఉండి మూడు ఫర్కాలు ఉండేవి. ఆనాడు కాళ్ల ఫిర్కా నుండి, ఉండి ఫిర్క నుండి పోటీల్లో దిగారు తప్ప ఆకివీడు ఫిర్కా నుంచి మాత్రం ఎవరికీ ఏనాడూ స్థానం లభించలేదు. ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా పోటీకి అభ్యర్థులను ఇక్కడి నుంచి ఎంపిక చేయలేదు. ఒక స్వతంత్ర అభ్యర్థి మాత్రం ఒకే ఒకసారి ఎన్నికయ్యారు. మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన కట్రెడ్డి కుసుమేశ్వరరావు నాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి గెలుపొందారు. అయితే ఆయన మరణించడంతో ఆయన భార్య ఆండాలమ్మకు సానుభూతిగా టిక్కెట్ ఇచ్చిన ఉదంతం ఒకటి మాత్రం ఉంది. ఇదే మండలంలోని అయిభీమవరం గ్రామానికి చెందిన రాష్ట్ర మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు కృష్ణా జిల్లా నుంచి ఈ జిల్లాలో అత్తిలి నుండి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి శాసనసభకు వెళ్లారు. అనంతరం ఆయనే ఈ మండలం నుండి పార్లమెంటుకు కూడా పోటీ చేసి గెలిచారు. అంతే తప్ప ఏ సాధారణ ఎన్నికల్లో కూడా ఏ ఒక్క రాజకీయ పార్టీ కానీ ఉండి నియోజకవర్గం నుండి రాష్ట్ర శాసనసభకు పోటీ చేసేందుకు తమ పార్టీ అభ్యర్థిగా ఏ ఒక్కరిని, ఈ ఫిర్కా నుండి గాని మండలం నుండి గాని ఎంపిక చేసిన చరిత్ర లేదు. మొట్టమొదటిసారి ఐ భీమవరం గ్రామానికి చెందిన కనుమూరు రఘు రామకృష్ణంరాజు ఎత్తులకుపై ఎత్తులతో సీటు సాధించి మొట్టమొదటి రాజకీయ పార్టీ టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని చెప్పొచ్చు. ఫలితం ఎలా ఉన్న అభ్యర్థి మాత్రం ఆయనే.

స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల పర్వం దేశానికి గర్వం అని.. ఈ దృష్ట్యా సాధారణ ఎన్నికల్లో ఓటువేసే అవకాశాన్ని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ కోరారు. రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యంలో ఇది ప్రధాన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో రాజ్యాంగం మనకు పౌరులుగా అనేక హక్కులు ఇచ్చిందన్నారు. అయితే అది మనలో ప్రతిఒక్కరూ తమ విధిని నిర్వర్తించాలని కూడా ఆశిస్తుందన్నారు. మన మాతృభూమి పౌరులుగా బాధ్యతాయుతంగా ఓటువేయడానికి ఈ అవకాశాన్ని ఏ ఒక్కరూ వదులుకోకుండా అర్హులైన ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2019 ఎన్నికల కన్నా 2024 ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని ఆయన ఆకాంక్షించారు.

వైసిపిది దుర్మార్గ పాలన

ప్రచారంలో రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

ప్రజాశక్తి - తణుకురూరల్

వైసిపి దుర్మార్గ పాలన పట్ల, ప్రతి ఇంటిలోనూ కన్నీటి గాధ కనిపిస్తోందని మాజీ ఎంఎల్ఎ, టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి తెలిపారు. ఆదివారం తణుకులోని 20వ వార్డులో టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుందామన్నారు. జగన్ ఇల్లు ఉందని, కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని కుంటిసాకులు చెబుతూ చాలా మందికి పింఛన్లు తీసేస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చాక అర్హులైన వారందరికీ పూర్తి స్థాయిలో పింఛన్లు అందిస్తామన్నారు. అనంతరం తణుకు మండలం దువ్వ గ్రామంలో పలు చర్చిల్లో జరుగుతున్న ప్రార్థనల్లో కృష్ణతులసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, తణుకు పట్టణాధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఒమ్మి రాంబాబు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, నండూరి రామానుజన్, తాతపూడి మారుతీరావు, తామరపు రమణమ్మ, కొండేటి విజయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

తన తండ్రి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని రాధాకృష్ణ తనయుడు ఆరిమిల్లి నిఖిల్‌రత్న ప్రచారం నిర్వహించారు. అత్తిలి మండలం గుమ్మంపాడులో ఇంటింటికీ ప్రచారం చేపట్టి రాధాకృష్ణ ఎన్నికైతే ప్రజలకు జరిగే మేలును వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. అనంతరం తణుకులోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో యువతను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో క్రీడా సౌకర్యాలతో మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. వారితో కాసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు.

భర్త కోసం భార్య, మామ కోసం అల్లుడు..

ప్రజాశక్తి - తణుకురూరల్

ముఖ్యమంత్రి జగన్ ప్రజల పక్షాన పోరాడుతున్నారని మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సతీమణి కారుమూరి లక్ష్మీకిరణ్, అల్లుడు దిలీప్‌కుమార్ అన్నారు. ఆదివారం వైసిపి తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా కారుమూరి వెంకటనాగేశ్వరరావును, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల అభ్యర్థిత్వాలను బలపరుస్తూ అత్తిలి మండలం అత్తిలి, గుమ్మంపాడు, వరిఘేడు, బల్లిపాడు తదితర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలను కారుమూరి లక్ష్మీకిరణ్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో ప్రార్థనా మందిరాన్ని కారుమూరి అల్లుడు దిలీప్‌కుమార్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


మాట్లాడుతున్న కారుమూరి సతీమణి లక్ష్మీకిరణ్

ప్రచారం చేస్తున్న ముదునూరి సతీమణి, అల్లుడు

అత్తతో కలిసి అల్లుడి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

మామ కోసం అత్తతో కలిసి అల్లుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నరసాపురంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు గెలుపు కోసం వారి కుటుంబ సభ్యులంతా ప్రచారం చేపట్టారు. పట్టణంలోని ఏడో వార్డులో ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదరాజు సతీమణి శారదావాణి, ఆయన అల్లుడు డాక్టర్ అనిర్విన్న అడ్డురి ప్రచారంలో పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరలా జగన్‌ను సిఎంను చేయాలని ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీను, రవితేజ పాల్గొన్నారు.

పగలు శిబిరంలో..

సాయంత్రం ప్రచారంలో

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండిపోతున్న ఎండల కారణంగా సామాన్యులతో పాటు వివిధ పార్టీల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచారాలు ముమ్మరం చేశాయి. అయితే పెరిగిన ఎండల దృష్ట్యా పగలు ఆయా పార్టీల కార్యకర్తలు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. వారంతా సాయంత్రం నాలుగు గంటలు దాటాక వాతావరణం కాస్త చల్లబడ్డాక పార్టీ కరపత్రాలతో రాత్రి తొమ్మిది గంటల వరకూ ప్రచారాలు చేస్తున్నారు.

నరసాపురంలో అభివృద్ధి శూన్యం

జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - భీమవరం, నరసాపురం

వైసిపి ఐదేళ్ల పాలనలో నరసాపురంలో జరిగిన అభివృద్ధి సూన్యమని జనసేన నరసాపురం నియోజకవర్గ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ విమర్శించారు. ఆదివారం జరిగిన వారాహి విజయ భేరి సభలో ఆయన మాట్లాడారు. 2019లో తాను ఓటమి చెందినప్పటికీ బిసి సామాజిక వర్గానికి చెందిన తనకు రెండోసారి అవకాశం కల్పించిన పవన్‌కి పాదాభివందనం చేస్తున్నానన్నారు. మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్న వైసిపి ఎంఎల్ఎ ప్రసాదరాజుని నమ్మొదన్నారు. జిల్లా కేంద్రం పక్క నియోజకవర్గానికి తీసుకెళ్లి నరసాపురంకి అన్యాయం చేశారన్నారు. సరైన తాగునీరు లేదని, ఇళ్ల పట్టాలు ఇవ్వలేక పోయారన్నారు. నాసిరకం ఏటిగట్టి పనులు చేసి అవినీతి చేశారన్నారు. కులాలు మధ్య చిచ్చు పెట్టేలా ప్రసాదరాజు వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ 2014 జరిగిన ఎన్నికలలో పవన్ కళ్యాణ్ ఆశీర్వాదంతో తనకు రూ.20 వేల మెజార్టీ వచ్చిందన్నారు. ఐదేళ్లలో ఎంతో ఇబ్బందులు పడ్డారన్నారు. అవినీతి అక్రమాలతో సంపాదించిన డబ్బుతో ప్రస్తుత ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని, ప్రసాదరాజుని సొంత నియోజకవర్గం పంపించేయాలన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ ని స్వార్థంగా పవన్ రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నరసాపురంలో జనసేన జెండా ఎగురవేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న నాయకర్


ప్లకార్డులతో విద్యార్థులు

ప్ల కార్డులతో విద్యార్థుల ప్రదర్శన

నరసాపురం: మండలంలోని స్వర్ణాంధ్ర కళాశాలకు హెలిప్యాడ్‌లో చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవింద్ రావు, నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ మాధవ నాయుడు స్వాగతం పలికారు. అనంతరం కొంతమంది నాయకులు ముందుగానే సమావేశానికి వెళ్లిపోయారు. వసతి దీవెన రూ.30 వేలకు పెంచాలి, పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వాలని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. రెగ్యులర్ చేయాలని ఎయిడెట్ కళాశాలలో ఎన్నో ఏళ్లు పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఐదు గంటలకు హెలిప్యాడ్‌లో దిగిన తర్వాత గంట సేపు క్యారీవాన్‌లో ఉండి పోయారు. వంగవీటి రాధ మావయ్య, అత్తయ్య జక్కం బాబ్జి, అమ్మాణిలు పవన్ కళ్యాణ్‌కి యోగ వాసిస్టం పుస్తకం అందజేశారు. అనంతరం కూనపురెడ్డి ఏసు, ఈద జోన్సీ, ఎవి.రమణ, బళ్ల వెంకటేశ్వరరావు పార్టీలో జాయిన్ అయ్యారు. కార్‌పై ఉండి పవన్ కళ్యాణ్ కార్యకర్తలు, అభిమానులతో బయలుదేరారు.

నేడు పవన్ కళ్యాణ్ గణపవరం రాక

ప్రజాశక్తి - గణపవరం

జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సోమవారం సాయంత్రం ఏడు గంటలకు గణప వరంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని మాట్లాడతారని ఉంగుటూరు నియోజకవర్గం జనసేన అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పవన్ కళ్యాణ్ సోమవారం వారాహి విజయభేరి కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెంలో బహిరంగ సభ ముగించుకొని పిప్పర మీదుగా గణపవరం రాత్రి 7 గంటలకు స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొని మాట్లాడతారన్నారు. సభ జయప్రదం కావడానికి కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు, స్థానిక ప్రజలు సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సభ అనంతరం పవన్ కళ్యాణ్ భీమవరంలో జరిగే సభలో పాల్గొంటారని తెలిపారు.

ప్రచారం నిర్వహిస్తున్న సూర్యకుమారి

సూపర్ సిక్స్ పథకాల అమలుతో లబ్ధి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల అమలతో లబ్ధి చేకూరుతుందని నిమ్మల సూర్య కుమారి అన్నారు. ఆమె పాలకొల్లు మండలం ఆగరు గ్రామంలో పాలకొల్లు ఎంఎల్ఎ, కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు విజయాన్ని కాంక్షిస్తూ టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఎంఎల్ఎ రామానాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు గాదిరాజు అర్జున్ రాజు, కలిదిండి శ్రీనివాసరాజు, రాచమల్ల మీరయ్య, పంచగళ్ల సైమన్, మేడిది జాన్ రాజ్, కాకిలేటి రామారావు, బాపన్న రాజు, సేవా మిత్ర, సాధికార మిత్ర, యువత, సభ్యులు, గ్రామ ప్రజలు, ఉంగరాల నరసింహారావు, ద్రాక్షారపు జ్యోతి, బండారు ఆదిలక్ష్మి, పరువు సుజాత, పోలినాటి నాగలక్ష్మి, పాల విజయ కుమారి పాల్గొన్నారు.

భీమవరంలో రౌడీ రాజ్యం పోవాలి : పవన్‌కళ్యాణ్

భీమవరం రూరల్ : భీమవరంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ రౌడీ రాజ్యం పోవాలని, ప్రశాంతమైన భీమవరం రావాలంటే అనుభవజ్ఞులైన పులపర్తి రామాంజనేయులును గెలిపించాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. వారాహి యాత్రలో భాగంగా స్థానిక ప్రకాశం చౌక్‌సెంటర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. భీమవరంలో పోటీ చేయడానికి తన దగ్గర రూ.200 కోట్ల డబ్బులు లేవని, ఓటుకు రూ.ఆరు వేలు స్థాయి లేదన్నారు.

భీమవరంలో పవన్ ఎన్నికల ప్రచార సభ

గ్రంధికి డిపాజిట్లు కూడా రాకుండా చేస్తానన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని అమలు చేసే బాధ్యత జనసేన పార్టీ తీసుకుంటుందన్నారు. భీమవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అసెంబ్లీలో చర్చించి సంవత్సరంలోపు సిపిఎస్ రద్దు చేస్తామన్నారు. జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు మాట్లాడుతూ భీమవరంలో అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నామన్నారు. టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు పాల్గొన్నారు.

25న వైసిపి మేనిఫెస్టో : విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 25న వైసిపి మేనిఫెస్టో విడుదల చేస్తున్నారని, వైసిపికి ప్రజలే స్టార్ క్యాంపెయిన్‌లుగా ఉంటారని ఆ పార్టీ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైసిపి మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఆ పార్టీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు అధ్యక్షతన తులసి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్లచే ఫ్యాన్ గుర్తుకు ఏ విధంగా ఓట్లు వేయించుకోవాలో శ్రీనివాస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పి ప్రజల నుంచి ఓట్లు రాబట్టుకోవాలన్నారు. ప్రజలు కోరుకున్నట్లుగానే వైసిపి పాలన అందించిందన్నారు. ఓటు అడిగే హక్కు ఒక్క వైసిపికే ఉందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసిపి కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహాన్ని వీడియో ద్వారా కార్యకర్తలకు వివరించారు. ఈ నెల 25న వైసిపి మేనిఫెస్టో విడుదల చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలు చేసిన నవరత్నాల పథకాలు, కొత్తగా మ్యానిఫెస్టోలో చేర్చే కొత్త పథకాలను ప్రజలకు వివరించడం ద్వారా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజల భాగస్వామ్యంతో ప్రతి వైసిపి కార్యకర్త ఐక్యతతో ముందుకు వెళ్లాలన్నారు.

ఉండి రఘురామకే..

(మొదటి పేజీ నుంచి)

రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెప్పొచ్చు.

ఉండిలో టిడిపి నుంచి రఘురామకృష్ణంరాజే

జనసేనతో పొత్తు పెట్టుకున్న టిడిపి జిల్లాలో టిక్కెట్ల కేటాయింపుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఉండి, దెందులూరు అభ్యర్థుల ఎంపికపై ఆది నుంచి రాజకీయ దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎంఎల్ఎలు అందరికీ టిక్కెట్లు ఖాయమని ఎన్నికలకు చాలా రోజుల ముందే చంద్రబాబు ప్రకటించారు. అందులో భాగంగానే ఉండి టిక్కెట్ ప్రస్తుత టిడిపి ఎంఎల్ఎ మంతెన రామరాజుకు కేటాయించారు. 2019లో నరసాపురం ఎంపీగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆ పార్టీపై తిరుగుబాటుకు దిగారు. టిడిపికి అనుకూలంగా వ్యవహరించారు. దీంతో ఈ ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా రఘురామకృష్ణంరాజు పోటీ చేస్తారంటూ పెద్దఎత్తున ప్రచారం సాగడంతోపాటు, తాను పోటీలో ఉంటానని రఘురామకృష్ణంరాజే స్వయంగా ప్రకటించుకున్నారు. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం బిజెపికి వెళ్లింది. దీంతో బిజెపి తరపున రఘురామకృష్ణంరాజు పోటీ చేస్తారన్న ప్రచారం సాగింది. అయితే బిజెపి ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. నరసాపురం ఎంపీ టిక్కెట్ భూపతిరాజు శ్రీనివాసవర్మకు బిజెపి కేటాయించింది. దీంతో రఘురామకృష్ణంరాజుకు ఎదురు దెబ్బ తగిలింది. దీంతో టిడిపి రఘురామకృష్ణంరాజును మోసగించిందని రాజకీయ దుమారం రేగింది. దీంతో ఉండి ఎంఎల్ఎగా ఆయనకు టిక్కెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం నడిచింది. ఉండి టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు అనుచరులు తిరుగుబాటుకు దిగారు. దీంతో ఉండి టిక్కెట్ ఎవరికిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 22న నామినేషన్ వేయనున్నట్లు రామరాజు ప్రకటించగా, 20వ తేదీన రఘురామకృష్ణంరాజు తరపున ఆయన కుటుంబీకులు నామినేషన్ వేశారు. దీంతో ఉండిలో టిడిపి నుంచి పోటీలో ఎవరుంటారోననే సస్పెన్స్ కొనసాగింది. ఉండి టిడిపి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజుకు చంద్రబాబు ఆదివారం బి.ఫారం ఇవ్వడంతో సస్పెన్స్ వీడింది. రామరాజుకు టిడిపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష పదవి కేటాయించి ఆయనను బుజ్జగించారని తెలుస్తోంది. జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న తోట సీతారామలక్ష్మిని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా తీసుకున్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకుంటాం

(మొదటి పేజీ నుంచి)

34 శాతం ఉండే బిసి రిజర్వేషన్లను వైసిపి ప్రభుత్వం 24 శాతానికి కుదించిందని, గతం మాదిరిగానే 34 శాతానికి తీసుకెళ్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు వారికే అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నరసాపురంలో వశిష్ఠ గోదావరిపై వారధి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ వారధి నిర్మించకుండా వైసిపికి ఓట్లడిగే హక్కు లేదని, ఇది ప్రజలే చెప్పాలని అన్నారు. లేసు అల్లికలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో 970 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉందని, తీర ప్రాంత మత్స్యకారుల ప్రతినిధిగా బొమ్మిడి నాయకర్‌ను ఇక్కడ నిలబెట్టామని తెలిపారు. 70 లక్షల మత్స్యకార కుటుంబాలకు హాని కల్గించే జిఒ నెం.217ను రద్దు చేస్తామన్నారు. 51 మత్స్యకార సొసైటీలకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామన్నారు. బిసిలపై అకారణంగా పెట్టిన కేసులను రాబోయే రోజుల్లో ఎత్తివేస్తామన్నారు. మత్స్యకార కుటుంబాలకు రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నరసాపురంలో నియంతృత్వ పాలన సాగుతుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఒకే కులానికి చెందిన 40 మంది అధికారులను బదిలీ చేయడం దారుణమన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. తాను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయబోనని, రాజ్యాంగాన్ని నమ్మానని తెలిపారు. జగన్ గొడుగు కిందకు వెళ్లిన ప్రతిఒక్కరూ రౌడీయిజం చేస్తున్నారన్నారు. జగన్‌లా తనపై 32 కేసులు లేవన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి తన సోదరుడు చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా పోయిందని, ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు. దళిత డ్రైవర్‌ను చంపిన ఎంఎల్‌సిని అక్కడ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఊరేగించడం దారుణమన్నారు. వైసిపి కులాలను విడగొట్టుకుంటే వెళ్తే తాను కలుపుకుంటూ వెళ్తానన్నారు. బిజెపి మద్దతు లేకపోతే రాష్ట్రం అభివృద్ధి అసాధ్యమన్నారు. తిరుపతిలో అన్యమత ప్రచారం చేయకూడదని ఉన్న నిబంధన గురించే మాట్లాడాను తప్ప తాను హిందువేతరులకు వ్యతిరేకం కాదని, అప్పటికీ తనది తప్పనుకుంటే తనను శిక్షించాలని వ్యాఖ్యానించారు. ఈ నెల 23న పిఠాపురంలో తాను నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. ఈ సభల్లో జనసేన నరసాపురం, భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థులు బొమ్మిడి నాయకర్, పి.రామాంజనేయులు, బిజెపి ఎంపీ అభ్యర్థి భూతిపరాజు శ్రీనివాసవర్మ, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన నేత చాగంటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రత్యక్ష, పరోక్ష మిత్రులను ఓడించాలి

(మొదటి పేజీ నుంచి)

రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని, బిజెపి మద్దతుదారులను వ్యతిరేకించాలని, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏర్పడిన ఇండియా ఫోరంలోని పార్టీలను గెలిపించాలని సిపిఎం పిలుపునిస్తుందన్నారు. ఈ సందర్భంగా సిపిఎం ఎన్నికల ప్రణాళిక బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపిదే విజయం

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వచ్చే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లను, అదే మాదిరిగా ఎంపి సీట్లను కచ్చితంగా గెలుచుకుంటామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డు, మెంటేవారితోట నుంచి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సిఎం జగన్ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. తాను ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నానని, కరోనా సమయంలో కూడా ప్రజలకు సేవలు అందించానని చెప్పారు. తాను ఎంఎల్ఎ పదవిని అలంకారప్రాయంగా చూడలేదని, ప్రజలకు సేవలందించే కార్మికుడిగా మాత్రమే చూశానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, పిప్పళ్ల నాని, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ఎస్.రాజు, ముత్యాల బుజ్జి, కొప్పర్తి జనార్థన్, అభిరుచి రఘు, ముత్యాల రామారావు ఉన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన అందరికీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. పట్టణంలోని స్థానిక 18, 19 వార్డు నుంచి ముస్లిం యువత పెద్దఎత్తున జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, పులపర్తి అంజిబాబు తనయుడు పులపర్తి ప్రశాంత్ సమక్షంలో శనివారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రశాంతమైన భీమవరం అభివృద్ధికి అందరం పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పత్తి హరి, మాగాపు ప్రసాద్, గిరి, మీనాక్షి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాత్రికులతో బండి ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

23న పాలకొల్లులో మావుళ్లమ్మ జాతర

పాలకొల్లు : ఈ నెల 23వ తేదీన పాలకొల్లులోని మావుళ్లమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి 108 బిందెలతో అభిషేకం చేశారు. మేడిది దానయ్య, కర్నేన గౌరునాయుడు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకా కర్నేన రోజారమణి, శంకరపు శ్రీను, అచ్యుతరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని భగ్గేశ్వరం గ్రామంలో యుఐపి ఇమ్యునైజేషన్ కార్యక్రమం ఎంఎల్‌హెచ్ పి ప్రవంతి ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు టిటి ఇంజక్షన్లు ఇచ్చారు. వారికి ఆరోగ్యపరమైన పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండడం వల్ల గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ రవిశంకర్, ఎఎన్ఎం భారతి, ఆశాలు సిహెచ్.లక్ష్మి, కె.కుమారి, కె.బేబి పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సంక్షేమం, అభివృద్ధే జగన్ ధ్యేయం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ప్రచారంలో ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సిఎం జగన్ పాలన చేశారని చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో 34వ రోజు ఆదివారం నిర్వహించిన ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ అందరి సహకారంతో నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని అవకాశాలు ఉపయోగించుకుని అభివృద్ధి చేశామన్నారు. కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీ తారతమ్యం లేకుండా అన్ని వర్గాల వారికి అండగా ఉండి సంక్షేమ పథకాలు అందించామన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో మహిళలు, రైతులు, అన్నివర్గాల ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో గుబ్బల రాధాకృష్ణ, బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కొట్టు సత్యనారాయణ ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కెఎన్ఎన్.కాలనీ నుంచి ప్రారంభమైన ప్రచారం మెట్ట ఉప్పరగూడెంలో ముగిసింది. కెఎన్ఎన్ కాలనీ, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం, పుల్లయ్యగూడెం, అప్పారావుపేట, వెంకట్రామపాలెం, గొల్లగూడెం, మోదుగగుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి కొట్టుతో పాటు మాజీ ఎంఎల్ఎ ఈలి నాని, అప్పడ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాంనాయుడు ఎన్నికల ప్రచార రథంపై నిలబడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కెఎన్ఎన్ కాలనీ వాసులంతా తనకు అండగా ఉన్నారని, ఈ ఎన్నికల్లో కూడా మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. జగనన్న ఇంటి స్థలాలు పెద్ద ఎత్తున ఇవ్వడంతో, ఈ ప్రాంతమంతా ఒక పెద్ద టౌన్ షిప్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మాజీ ఎంఎల్ఎ ఈలి నాని మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం మళ్లీ రావడానికి ఇక్కడ కొట్టు సత్యనారాయణను ఎంఎల్ఎగా గెలిపించాలని ఆయన కోరారు. నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. అప్పడ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి, శాంతి భద్రతల కోసం కొట్టును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో మంత్రి కొట్టు సత్యనారాయణ

రానున్న ఎన్నికల్లో నన్ను గెలిపించండి

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల

ప్రజాశక్తి - ఉండి

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని గూడూరి ఉమాబాల కోరారు. ఉండి మండలంలోని చెరుకువాడ గ్రామంలోని పలు ప్రార్ధన మందిరాల్లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్ చరిత్రలోనే తొలి మహిళ ఎంపీగా చిరస్మరణీయ విజయం సాధించే అవకాశం తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కల్పించారన్నారు. తన విజయానికి ప్రభు ఆశీస్సులు తోడుగా ఉండాలని, దానికోసం దైవజనులంతా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించాలని ఆమె కోరారు. గూడూరి ఉమాబాలతో పాటు ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఛైర్మన్ మేడిద జాన్సన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆకివీడులో శివరామరాజు ప్రచారం

ప్రజాశక్తి - ఆకివీడు

ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు మండలంలో ఇంటింటి ప్రచారం సాగిస్తున్నారు. మూడు రోజులుగా మండల కేంద్రం ఆకివీడు పట్టణం పరిసరాల్లో తిరుగుతున్న ఆయన శనివారం, ఆదివారం రెండు రోజులు పట్టణంలో పల్లెనిద్ర చేశారు. శనివారం రాత్రి 19వ వార్డులో నిద్ర చేసిన ఆయన అక్కడ నుంచి దుంపగడప రోడ్డు, చేపల మార్కెట్‌లో ప్రతి కొట్టుకు తిరిగారు. ప్రతిఒక్కరినీ ఓటు అభ్యర్థించారు. తాను సాధారణ ప్రజానీకానికి అందుబాటులో ఉండేవాడినని, గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ప్రధాన సెంటర్లో తిరిగారు. అనంతరం ఆదివారం రాత్రి ఆకివీడులోనే ఆయన పల్లెనిద్ర చేశారు.



ప్రచారంలో శివరామరాజు

విద్యుత్ కోతలను అరికట్టాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

విద్యుత్ కోతలను అరికట్టాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలో విద్యుత్ కోతలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు ఉండడం దీనికి తోడు ఉక్కపోత తీవ్రమైన ఎండల కారణంగా గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరితోపాటు గ్రామంలో చిరు వ్యాపారులు, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తిదారులు (టైలర్స్) పని చేసుకోవడానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉపాధి కోల్పోతున్నారన్నారు. గ్రామంలో దాదాపు వారం రోజులుగా పగలు రాత్రి అని తేడా లేకుండా సమయపాలన లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని శ్రీదేవిజానకి థియేటర్ వద్ద ఉన్న కడలి వారి వీధిలో రామాలయం వద్ద ఆదివారం అన్న సమారాధన చేశారు. ఇటీవల శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నేడు నామినేషన్ వేసే అభ్యర్థులు వీరే..

జనసేన ఎంఎల్ఎ అభ్యర్థిగా నాయకర్ నామినేషన్

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం పట్టణంలోని జనసేన కార్యాలయం నుంచి పంజా సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, అంబేద్కర్ సెంటర్, మొగల్తూరు రోడ్డు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగుతుందని తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ భీమవరం అభ్యర్థిగా అంకెం సీతారామ్

భీమవరం రూరల్ : కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థిగా తాను ఈ నెల 22వ తేదీ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు అంకెం సీతారామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఇండియా వేదిక నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆర్‌డిఒ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ఇండియా వేదిక నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థిగా రామారావు

తణుకు :కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థిగా ఈ నెల 22వ తేదీ సోమవారం తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కడలి రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేస్తానని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు తణుకు ఎంఎల్ఎ అభ్యర్థిగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలి

ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి -తాడేపల్లిగూడెం

కల్లుగీత కార్మికుల సమస్యలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల ఓట్ల కోసం వాగ్దానాలు చేయకుండా గీత వృత్తిని కాపాడే విధంగా నిర్దిష్టంగా అమలు చేసే విధంగా ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం వాక రామచంద్రరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో గీత కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. బిసిలే రాష్ట్రానికి వెన్నెముక అంటూ గీత కార్మికులను గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఓట్ల బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఏడాది రూ.ఐదు వేల కోట్ల నిధులు కేటాయించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ప్రమాదం జరిగిన నెల రోజుల్లో ఇవ్వాలని, పెన్షన్ రూ.ఐదు వేలకు పెంచాలని, గీత కార్మికుల బిడ్డలకు పెళ్లి కానుక రూ.లక్షకు పెంచి పెళ్లైన నెల రోజుల్లో ఇవ్వాలని కోరారు. కల్లు గీత సొసైటీలకు 40 శాతం మద్యం షాపులు కేటాయించాలని, తాటి చెట్టుకు రూ.10 చొప్పున కిస్తీలు కట్టించుకోవడం, కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయడం, వృత్తిలో చనిపోయిన వారికి దహన సంస్కారాలకు రూ.30 వేలు, దెబ్బలు తగిలినవారికి వైద్యం ఖర్చులకు రూ.25 వేలు కార్పొరేషన్ నుంచి ఇవ్వాలన్నారు. పేద గీత కార్మికులకు ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించి ఇవ్వాలని, బోగస్ కులాల కార్పొరేషన్ తక్షణం రద్దు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని తీర్మానించారు. ఈ సమావేశంలో యర్రా దేముడు, కామన మునిస్వామి, కుడుపూడి పెద్దిరాజు, కడలి పాండు, కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐతో మాట్లాడుతున్న బొలిశెట్టి, వలవల

తాడేపల్లిగూడెంలో నేడు పవన్ పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన బొలిశెట్టి, వలవల

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో సోమవారం సాయంత్రం జరిగే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర పర్యటన ఏర్పాట్లను ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆదివారం పరిశీలించారు. పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రహ్మణ్యంలతో ట్రాఫిక్ అంశాలపై చర్చించారు. పవన్‌కళ్యాణ్ హెలికాప్టర్ ఎస్ఆర్ గ్రౌండ్స్ వద్ద ల్యాండ్ చేయించి, అక్కడ నుంచి రోడ్డు మార్గంగా జివి మాల్ సెంటర్లో జరిగే బహిరంగ సభలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

'పవన్ పర్యటన విజయవంతం చేద్దాం'

వారాహి యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తాడేపల్లిగూడెం పర్యటనను విజయవంతం చేయాలని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక జివి మాల్ సెంటర్లో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు జరిగే పవన్ బహిరంగ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు నాకు మధ్యే పోటీ

గోదావరి సత్తా చాటాలి

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు పివిఎల్‌కు మధ్య పోటీ కాదని, జగన్‌కు తనకు మధ్యే పోటీ అని, గోదావరి సత్తా చాటాల్సిన అవసరం ఉందని టిడిపి

అభివాదం చేస్తున్న నేతలు

ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని జక్కరం గ్రామంలో టిడిపి ఉండి నియోజకవర్గ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ మండలాధ్యక్షులు గుండా బత్తుల వెంకట నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ 2014లో టిక్కెట్ దక్కని పరిస్థితి నేడు ఉండి సీటు కోసం ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆశించినా అదే నిరాశ ఎదురైందన్నారు. ఈ నెల 22వ తేదీన టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ఆధ్వర్యంలో తాను ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఉండి నియోజకవర్గంలో ఘనవిజయం సాధించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉండికి ఇద్దరు ఎంఎల్ఎలు ఉంటారన్నారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ శనివారం మంగళగిరిలో జరిగిన సమావేశంలో చంద్రబాబు తనను పిలిచి కుటుంబ పెద్దగా నిన్ను అడుగుతున్నాని, కాదనకుండా సహకరించాలన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు కూటమి గెలుపు కోసం ఉండి టిక్కెట్టును రఘురామకృష్ణంరాజుకు కేటాయించాలని కోరడంతో కాదనలేకపోయానన్నారు. ఈ సమావేశంలో ముత్యాల రత్నం, కనకరాజు సూరి, జుత్తిగ నాగరాజు, కరిమెరక నాగరాజు, జుత్తిగ శ్రీనివాస్, కొనకంచి సూరిబాబు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీసూర్యలో ఐఐటి, జెఇఇ-నీట్ అకాడమీ అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీసూర్య విద్యా సంస్థలు ప్రతిష్టాత్మకంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్న ఐఐటి, జెఇఇ-నీట్ అకాడమీ అవగాహనా సదస్సు ఆ విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రముఖ సైకాలజిస్ట్, ఈటీవీ ఫేమ్ ఎం.జానకిరామ్, నరసాపురం పట్టణంలో ప్రముఖ న్యాయవాది పి.స్మిత మాట్లాడుతూ నేటితరం విద్యార్థుల భవిష్యత్తు ఐఐటి, జెఇఇ-నీట్‌తో ముడిపడి ఉందన్నారు. సాధారణ పాఠశాల విద్యతోపాటు ఆబ్జెక్టివ్‌ను కూడా సమానంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకుని ఉన్నతంగా రాణించగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీసూర్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే పాఠశాల విద్య చాలా బలంగా ఉండాలని, హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థులకు ఐఐటి, జెఇఇ-నీట్‌లపై ఫౌండేషన్ ఉన్నట్లయితే కళాశాల స్థాయికి వచ్చేసరికి ఎలాంటి పోటీ పరీక్షనైనా తట్టుకుని నిలబడగలిగే సామర్థ్యం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 670 మంది 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ తరహా అవగాహనా సదస్సుల వల్ల తమ పిల్లలు ఏ రంగంలో ఆసక్తి చూపుతున్నారో తెలుసుకునే వీలుంటుందని, ఆ దిశగా చదివించేందుకు అవగాహన కలుగుతుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలతో పాటు శ్రీ సూర్య ఐఐటి, జెఇఇ-నీట్ అకాడమీ అకడమిక్ అడ్వైజర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ ఎఆర్ఎస్.కుమార్, డాక్టర్ కె.జానకిరామ్, డాక్టర్ ఫాజల్, ఎం.శ్రీనివాస్, కె.వంశీకిరణ్, ఎ.శివాజీ, పి.పుల్లారావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

13న దుకాణాలకు, సంస్థలకు సెలవు

కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13వ తేదీ పోలింగ్ రోజు దుకాణాలకు, సంస్థలకు సెలవు ప్రకటించినట్లు కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక దుకాణాలు చట్టాన్ని అనుసరించి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏదైనా వ్యాపారం, వాణిజ్యం, పారిశ్రామిక సంస్థ లేదా ఏదైనా ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు వేయడానికి పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలన్నారు. ఎవరైనా యజమాని నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో శిక్షార్హులని తెలిపారు. మే 13వ తేదీన పోలింగ్ జరిగే నియోజకవర్గం వెలుపల పనిచేసే సాధారణ కార్మికులు కూడా రోజు వారీ వేతనంతో ఓటు వినియోగించుకోవడానికి అర్హులని తెలిపారు.

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా సీతారామలక్ష్మి

జిల్లా అధ్యక్షులుగా మంతెన రామరాజు

నియామక ఉత్తర్వులు జారీ చేసిన అధిష్టానం

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా తోట సీతారామలక్ష్మి, జిల్లా అధ్యక్షులుగా ఉండి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి అధిష్టానం నియామక ఉత్తర్వులను ఆదివారం జారీ చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, జిల్లాల పునర్విభజన తర్వాత పశ్చిమ జిల్లా అధ్యక్షురాలుగా ఇప్పటివరకు తోట సీతారామలక్ష్మి పని చేశారు. గతంలో రాజ్యసభ సభ్యురాలిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులయ్యారు. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎన్నికల సమన్వయకర్తగా నియమించారు. అలాగే ఉండి సిట్టింగ్ ఎంఎల్ఎగా ఉన్న మంతెన రామరాజును టిడిపి జిల్లా అధ్యక్షునిగా నియమించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఉండి టిక్కెట్‌ను దక్కించుకుని తర్వాత భంగపడిన రామరాజుకు జిల్లా అధ్యక్షుడి పదవిని ఇచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

టిడిపి నరసాపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా మంతెన రామరాజు

కాళ్ల : టిడిపి నరసాపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉండి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు) నియమితులయ్యారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాల పట్ల పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల తనిఖీలు విస్తృత పరచాలి

జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాస్

ప్రజాశక్తి - కామవరపుకోట

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వాహనాల తనిఖీలు విస్తృత పరచాలని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జె.శ్రీనివాస్ ఆదేశించారు. కామవరపుకోట ఎన్నికల చెక్ పోస్ట్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీ చేసిన కార్ల నెంబర్ల రిజిస్టర్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సజావుగా ఎన్నికలు జరిపేందుకు ప్రతిఒక్కరిని సమాయత్తం చేయాలన్నారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సిబ్బంది బాగా పనిచేస్తున్నారని, అందులో కామవరపుకోట చెక్‌పోస్ట్ తనిఖీలో 20 మంది వ్యక్తుల నుంచి అనధికార సొమ్మును స్వాధీనం

సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీనివాస్

చేసుకోవడం చెక్‌పోస్ట్ సిబ్బంది పనితీరు ఆదర్శనీయమన్నారు. చెక్‌పోస్ట్‌లో పలు వాహనాలను తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మొహిద్దీన్, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎక్సైజ్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.శేషారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యారావు, గోవర్ధన్, శ్రీనివాస్, వీడియో గ్రాఫర్ వీరమల్ల మధు పాల్గొన్నారు.

గొల్లవానితిప్ప రోడ్డులో చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ శ్రీనివాస్

భీమవరం రూరల్ :గొల్లవానితిప్ప రోడ్డులో శ్రీ దుర్గాలక్ష్మి అమ్మవారి ఆలయం పక్కన) ఆర్ఆర్, ఫ్రెండ్స్ సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టూ టౌన్ సిఐ గుత్తుల శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గత ఆరేళ్ల నుంచి ప్రతి ఏడాది ఆర్ఆర్ సేవా సమితి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చుతుందన్నారు. రక్తదానం, పూర్ పీపుల్స్‌కు ఫుడ్ సప్లై చేయడం వంటి కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. సేవా సమితివారు ప్రజలకు ఉపయోగపడే మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గెద్దా రామారావు, కార్యదర్శి తోట వాసు, కోశాధికారి సంకు రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.